436) మాళవి

ప॥ హరి నెఱుగనిజన్మ మది యేలా ఆ- । సరుస నాతడులేని చదువేలా ॥

చ॥ దయదొలగనియట్టితపమేలా । భయములేనియట్టిభక్తేలా ।
ప్రియము మానినయట్టిపెనగేలా మంచి- । క్రియావిరుద్ధపుకీర్తనలేలా ॥

చ॥ ఫలములేనియట్టిపనులేలా కడు- । గలిమిలేనియట్టిగర్వమేలా ।
బలిమిలేనియట్టిపంతమేలా శౌరి- । దలచలేనియట్టితనువది యేలా ॥

చ॥ తన కమరనిదొరతనమేలా । చనవులేనియట్టిసలిగె యేలా ।
యెనలేని శ్రీవేంకటేశ్వరుని శరణని । మనగలిగినమీద మరిచింతలేలా ॥